# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 160 | విశాఖపట్నం | 12-3-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 160 | VISAKHAPATNAM | 12-3-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




2లో

### గుడివాడలో బెట్టింగ్ రాకెట్‌ను ఛేదించిన పోలీసులు



5లో

### హోటళ్లపై పౌరసరఫరాల శాఖ దాడులు



6లో

### గుండె ఆరోగ్యంగా ఉండాలంటే..!

# పేదల అభ్యున్నతికే పని చేస్తున్నాం

## కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** వ్యవసాయానికి మరింత ప్రోత్సాహమిస్తూ ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ సదస్సులో ప్రకటన చేశారు. అధికారుల ఫీల్డ్ విజిట్లపై ప్రత్యేక పోర్టల్ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం పని చేసేది పేదల కోసమే అని సంపన్నుల కోసం కాదని తేల్చి చెప్పారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ విక్రయదారులుగా మారేలా ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. పంట కాల్వల పూడికతీత, చెరువుల లింకేజీకి 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సీఎం ప్రకటించారు. అమరావతి సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో రెండు రోజుల పాటు జరిగే 6వ కలెక్టర్ల సదస్సు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగానికి ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ఐటీ, క్వాంటం, ఏఐ వంటి రంగాల్లో కొత్త టెక్నాలజీలు, ల్యాబులు ఏర్పాటు చేస్తున్న తరహాలోనే వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్?లో అంతర్జాతీయ స్థాయి అగ్రికల్చర్ స్కూల్ ఏర్పాటుపై మంత్రి పయ్యావుల కేశవ్ చేసిన ప్రదిపాదనలు బాగున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు కితాబిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం మంత్రులు, అధికారులతో జరిపిన చర్చలపై రాత్రి ఆలోచించాను అంటూ ఆయన ప్రకటన చేశారు. వ్యవసాయ రంగంలో కీలక మార్పులకు నాంది పలికేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త ప్రతిపాదనలు సూచించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దామన్నారు. సాగులో సాంకేతికత, ఆధునిక పద్ధతులు, ఆవిష్కరణలు, వ్యవసాయాన్ని లాభసాటి చేసే విషయంలో అత్యున్నత ప్రమాణాలతో అగ్రికల్చర్ స్కూల్ ఏర్పాటు చేద్దామని సూచించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ స్థాయిలో దేశానికి తలమానికంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ తీసువద్దామని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన వివిధ ఘటనలపై సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వేట్లపాలెం బాణాసంచా పేలుళ్లు, శ్రీకాకుళంలో డయేరియా, రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనల్లో అధికార యంత్రాంగం అలక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిలియనీర్ల కోసం పని చేయడం లేదని, పేదల కోసం పని చేస్తోందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. 13 తేదీన అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులు విడుదల చేస్తున్నామని ప్రకటించారు.అదేవిధంగా ఉగాది కానుకగా 2 లక్షల 50 వేల ఇళ్లకు గృహప్రవేశాలు చేస్తామని స్పష్టం చేశారు. దివ్యాంగులకు ఇంద్రధనస్సు పేరుతో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సచివాలయంలో (తరువాయి 2వ పేజీలో)

## ఏపీని చంద్రబాబు అప్పుల ఊబిలోకి

# నెట్టారు: జగన్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చిందని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడ్జెట్ గణాంకాల నుంచి అవినీతి వరకు పలు అంశాలపై గణంకాలతో సహా విమర్శలు గుప్పించారు. పరిపాలనాదక్షుడిగా బిల్డప్ ఇస్తున్న చంద్రబాబు, వాస్తవానికి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నీ మోసపూరిత అంకెలే ఉన్నాయని జగన్ ఆరోపించారు. కాగ్ నివేదికను ఉదహరిస్తూ.. ప్రభుత్వం చూపిస్తున్న లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని విమర్శించారు. "మేము ఐదేళ్లలో చేసిన అప్పుల కంటే చంద్రబాబు రెండేళ్లలోనే ఎక్కువ అప్పులు చేశారు" అని జగన్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో కోవిడ్ కష్టాల్లో కూడా ఎన్బీసీ (నెట్ బారోయింగ్ సీలింగ్ ) పరిమితిని దాటలేదని, కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే నెట్ బారోయింగ్ సీలింగ్ దాటి విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ. 3.31 లక్షల కోట్ల అప్పులు దాటేసిందని, జీఎస్డీపీ లో అప్పుల శాతం (తరువాయి 3వ పేజీలో)

## ఏపీ ప్రజలు ఆందోళన చెందొద్దు...

# గ్యాస్ కొరత లేదు: నాదెండ్ల



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గృహ, వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయన భరోసా ఇచ్చారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో, రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై మంత్రి ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కీలక సమయంలో గ్యాస్‌ను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించ కుండా జిల్లా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

## రూ.3 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి హాంఫట్

# కబ్జా చేసిన సర్పంచ్ భర్త

### దేవరాపల్లి మేజర్ పంచాయితీలో వెలుగు చూసిన కబ్జా పర్వం



- మూడు కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా
- రాత్రికి రాత్రే స్లాబ్‌లు వేస్తున్న సర్పంచ్ భర్త
- మేజర్ పంచాయతీలో భూములకు రెక్కలు రావడంతో కాపాడవలసిన సర్పంచ్!
- అసలు సిసలూ సూత్రధారి సర్పంచ్ భర్త.. కబ్జాకి ఆధ్యుడు
- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయిపోయిన పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు!!!
- కాసులకు కక్కుర్తి పడి అక్రమార్కుల అండగా అధికారి యంత్రం!!!
- పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన స్థానికుడు



దేవరాపల్లి, పతాకం న్యూస్: అనకాపల్లి జిల్లా, దేవరాపల్లి మండలం మేజర్ పంచాయతీలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ భర్త మలిబాబు ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన, ఉదంతం వెలుగులోకి వచ్చింది. మూడు కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములో విచ్చలవిడిగా స్లాబ్‌లు వేస్తున్న, అధికారులకి కునుకు లేని పరిస్థితి. కల్లుండి కబోదులుగా వ్యవహరిస్తున్నారు తప్ప ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులే కాసులకు కక్కుర్తి పడి, అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని స్థానికంగా ప్రజలు వాపోతున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడవలసిన అధికారులే కబ్జాదారులకు అండగా నిలిచి.. కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని అభియోగాలుమూట కట్టినట్టు సమాచారం.

స్థానిక యువకుడు ప్రభుత్వ భూమీ అన్యాక్రాంతం అయిపోతుంది అని మంగళవారం పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయంపై పతాకం న్యూస్ దేవరాపల్లి డిప్యూటీ తాసిల్దార్‌ని వివరణ కోరగా ఎక్కడైతే షెడ్డులు వేసి కట్టేస్తున్నారో అవన్నీ విచారణ చేసి పడగొడతామని డిటి అప్పారావు పతాకం న్యూస్ తో పంచుకున్నారు.

పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## గతి తప్పిన సభ

వచ్చే ఏడాదికి రాష్ట్ర గతిని నిర్ణయించే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సరైన దశ దిశ లేకుండానే ముగియడం ప్రజలకు నష్టదాయకం. ఈ పరిస్థితికి అధికార టిడిపి కూటమి, ప్రధాన ప్రతిపక్షం వైసిపిలదే బాధ్యత. ఫిబ్రవరి 11న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమైన సమావేశాలను మార్చి 6 వరకు నిర్వహించగా, ఉభయ సభలూ భేటీ అయింది పక్షం రోజులు. కాగా అత్యధిక దినాలు తిరుమల లడ్డూ కల్తీ అంశం కేంద్రంగా సాగిన కూటమి, వైసిపి పరస్పర తిట్ల దండకాలు జుగుప్స కలిగించాయి. ఇరు పక్షాల మధ్య డైలాగ్ వార్ పరిధులు దాటి మతం రంగు పులుముకోవడం అభ్యం తరకరం. లౌకిక రాజ్యాంగంపై ప్రమాణం చేసి కొలువులు వెలగబెడుతున్న మంత్రులే పలుమార్లు నిండు సభలో ఆజ్యం పోసి మతం చుట్టూ తిప్పడం ఆందోళన కలిగిస్తుంది. శాసనసభలో ప్రతిపక్ష హోదా ఇవ్వలేదంటూ వైసిపి సభ్యులు తొలి రోజు గవర్నర్ ప్రసంగానికి కొన్ని నిమిషాలు పాల్గొని వాకౌట్ చేసి ఇక సభ వైపు కన్నెత్తి చూడలేదు. మెజార్టీని చూసుకొని మండలికి హాజరైనా అక్కడ కూడా ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై కంటే స్వీయ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చింది. లడ్డూపై చర్చకు పట్టుబట్టి నాలుగు రోజులపాటు సభా కార్యకలాపాలను సాగనీయలేదు. లడ్డూపై అసెంబ్లీలో చర్చించిన సర్కార్, మండలిలో చర్చకు రెడీ అంటూనే దాటవేత చర్యలకు దిగింది. అసెంబ్లీలో చర్చకు వైసిపి వెళ్లలేదు. మండలిలో ప్రభుత్వమే చర్చ జరక్కుండా పన్నాగాలు రచించింది. లడ్డూపై చర్చ విషయంలో రెండు పక్షాలదీ పలాయనవాదంగా కనిపిస్తుంది. లడ్డూపై చర్చ పేరిట మండలిలో కనివిని ఎరుగని సన్నివేశాలు చోటు చేసుకోవడం బాధాకరం. మండలి ఛైర్మన్ మోషేను రాజు మతం గురించి మంత్రులు ప్రస్తావించి నాలుక్కరుచుకొని తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. ఛైర్మన్ సైతం తనది ఫలాన మతం అని ప్రకటించారు. మండలిలో వైసిపిని ఎదుర్కొనేందుకు పది మంది వరకు మంత్రులు తిష్ట వేశారంటే కూటమి సర్కార్ ఫోకస్ ఏమిటో అర్థమవుతుంది. అటు శాసనసభలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్, పలువురు మంత్రులు, కూటమి సభ్యులు వివాదాస్పద రీతిలో మతం ప్రస్తావనలు చేశారు. ప్రతిపక్షం లేకపోవడంతో శాసనసభ కూటమి పార్టీల సమావేశాన్ని తలపించింది. గత వైసిపి ప్రభుత్వంపై విమర్శలు, కూటమి సర్కార్‌పై పొగడ్తలతో సరిపోయింది. పలు అంశాలపై సిఎం చేసిన సుదీర్ఘ ప్రకటనలు సరేసరి. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ వివాదాస్పదమైంది. సూపర్ సిక్స్‌లోని ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి -- జాబ్ కేలండర్ సహా ఏభై ఏళ్లు నిండిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు పింఛన్ తదితర హామీలపై ఈ సమావేశాల్లోనూ సర్కార్ స్పష్టత ఇవ్వలేదు. కౌలు రైతులకు కొత్త చట్టం ఊసే లేదు. రూ.3.32 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఊహలతో నిండిపోయింది. చివరి రోజు ప్రవేశపెట్టిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలు వైసిపి, కూటమి ప్రభుత్వాల్లోని అవినీతి, అక్రమాల చిట్టాలు విప్పి బోనులో నిలబెట్టింది. రాష్టానికి జీవనాడిగా పేర్కొనే పోలవరం ప్రాజెక్టు అక్రమాలకు అడ్డాగా మారిందని రెండు ప్రభుత్వాల పనితీరును అద్దంలో చూపెట్టింది. డయాఫ్రంవాల్ నుంచి నిర్వాసితులకు పరిహారం, కాంట్రాక్టర్లకు వడ్డీ లేకుండా వందల కోట్లు ధారాదత్తం వరకు అన్నింటా చేతివాటమేనని కాగ్ నిర్ధారించింది. నిర్వాసితులకు సహాయ పునరావాసం 11 శాతమే పూర్తయిందని తేల్చడం ద్వారా లక్షకుపైన నిర్వాసితుల కుటుంబాల మనోవ్యధను అక్షరబద్ధం చేసి ప్రభుత్వాల అబద్ధపు ప్రచారాన్ని తుత్తనియలు చేసింది. ముంపు ప్రాంతాల గుర్తింపునకు చేసిన లైడార్ సర్వే వివరాలు కాగ్‌కు ప్రభుత్వం ఇవ్వలేదంటే ఏ వ్యవస్థ పట్ల లెక్కలేదని తెలుస్తుంది. ఆదాయార్జన శాఖల్లో లోపాలు, కేంద్రం నుంచి 15 వేల కోట్ల తగ్గుదల, అప్పులు, చేబదుళ్లతో ఖజానా నిర్వహణ, వేల కోట్ల కార్మిక సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపు ఇత్యాది ప్రభుత్వ ఆర్థిక అరాచకాలను కాగ్ ఎత్తి చూపింది. ఆడిట్ పేరాలను ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తోందన్న కాగ్ వ్యాఖ్య తీవ్రమైనది. కాగ్ అభ్యంతరాలపై పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వం చర్చించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## తిరుమల వెళ్లకుండానే శ్రీవారి డాలర్లు.. దేశవ్యాప్తంగా భక్తులకు అందుబాటులోకి!




**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ శుభవార్త చెప్పింది. స్వామివారి దర్శనానంతరం భక్తులు ఎంతో పవిత్రంగా భావించి కొనుగోలు చేసే బంగారు, వెండి డాలర్లను ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న భక్తులకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి పోస్టల్ సర్వీస్ ద్వారా వాటిని నేరుగా ఇంటికే పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల టీటీడీ ఆదాయం పెంచే మార్గాలపై అధ్యయనం కోసం ఓ ఫైనాన్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ శ్రీవారి డాలర్ల విక్రయాలను మరింత పెంచాలని, వాటిని ఆన్‌లైన్‌లో కూడా విక్రయించాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులకు టీటీడీ పాలకమండలి ఆమోదం తెలిపింది. దీంతో త్వరలోనే ఆన్‌లైన్ విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం తిరుమలలోని కౌంటర్లలో విక్రయిస్తున్న బంగారు, వెండి డాలర్లు, పెండెంట్లతో పాటు కొత్తగా నాణేలను కూడా ఆన్‌లైన్‌లో అమ్మనున్నారు. అంతేకాకుండా, ఇటీవల బంగారం ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో సామాన్యులను దృష్టిలో ఉంచుకుని, వెండి డాలర్లకు బంగారు పూత పూసి తక్కువ ధరకే విక్రయించాలని కమిటీ ప్రతిపాదించింది. డాలర్లను మరింత ఆకర్షణీయమైన డిజైన్లలో తయారు చేయాలని కూడా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే డాలర్లు భక్తులకు సురక్షితంగా చేరేలా ట్రాన్సిట్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని టీటీడీ భావిస్తోంది. ఈ నిర్ణయంతో తిరుమల రాలేని భక్తులు కూడా స్వామివారి డాలర్లను సులభంగా పొందే అవకాశం కలగనుంది.

## గుడివాడలో బెట్టింగ్ రాకెట్‌ను ఛేదించిన పోలీసులు




**గుడివాడ, పతాకం న్యూస్:** ప్రస్తుత సమాజాంలో క్రికెట్ బెట్టింగ్ రోజురోజుకీ విస్తరిస్తోంది. పట్టణాల నుంచి గ్రామాల వరకూ ఇది పాకింది. ఇప్పుడు పలు వెబ్‌సైట్లు, యూట్యూబ్ ఛానళ్ల ద్వారానే కాకుండా మొబైల్ యాప్‌ల రూపంలోనూ వచ్చేశాయి. ఇందులో చిక్కుకొని బాధితులు అల్లాడుతున్నారు. ఆన్‌లైన్‌లో తారసపడుతున్న యాడ్స్ క్షణాల వ్యవధిలో ఖాతాలను ఖాళీ చేస్తున్నాయి. బెట్టింగ్‌ల మోజులో పడి కొందరు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకుంటుంటే నష్టపోయిన మరికొందరు మోసాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రోజురోజుకీ పెరుగుతున్న ఈ తరహా మోసాలు కలవర పెడుతున్నాయి. వీటిపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. అయినా పలువురు రాజకీయ నేతల అండతో పుట్టగొడుగుల్లా ఎక్కడోచోట పుట్టుకొస్తూనే ఉన్నాయి. తాజాగా కృష్ణా జిల్లా గుడివాడలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వైఎస్సార్సీపీ మాజీ మంత్రి కొడాలి నాని అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. గుడివాడలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు మసాలా శివతో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెట్టింగ్ రాయుళ్ల వద్ద నుంచి రూ.1.05 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టిడ్కో కాలనీ ఫ్లాట్లలో మసాల శివ, అతని అనుచరులు ఆన్‌లైన్ యాప్‌లలో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. మసాల శివ ఫోన్లో పలువురు పోలీస్ అధికారుల వ్యక్తిగత, వైఎస్సార్సీపీ ముఖ్య నేతల నెంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో, ఎన్నికల నిర్వహణ కోసం కొడాలి నానికి పెద్ద ఎత్తున మసాలా శివ నగదు సమకుర్చారు. వైఎస్సార్సీపీ హయాంలో మసాలా శివతో జట్టుకట్టి కొడాలి నాని రాజకీయ వ్యూహకర్త వినోద్ బెట్టింగ్ దందాలు నడిపించారు. పోలీసులు ఇప్పటికే వినోద్‌ను అరెస్టు చేశారు. బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించి వాట్సప్ చాటింగ్, ఫోన్ స్క్రీన్ షాట్లను గుర్తించామని గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు తెలిపారు. బెట్టింగ్ నిర్వాహకుడు మసాలా శివ, అతనికి సహకరిస్తున్న భాను ప్రసాద్, కనక మహేష్, అజయ్ బాబు, వంశీ కిరణ్‌లను అరెస్ట్ చేశామన్నారు. మరో 17 మంది బుకీలు, బెట్టింగ్‌లలో భాగస్వామ్యులైన మరో 92 మందిని గుర్తించామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లను మరింత సమాచారం కోసం ఫోరెన్సిక్ అనాలసిస్‌కు పంపామన్నారు.

## చర్లపల్లి ప్లాంట్లలో తగ్గిన గ్యాస్ సరఫరా.. రోడ్లపై నిలిచిన ట్యాంకర్లు




**చర్లపల్లి, పతాకం న్యూస్:** చర్లపల్లిలోని ప్రధాన గ్యాస్ నింపే కేంద్రాల్లో ఇంధన సరఫరా ఒక్కసారిగా కుంటుపడింది. భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్ పీసీఎల్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) సంస్థల నుంచి ఇంధన సరఫరా దాదాపు 75 శాతం మేర తగ్గిపోవడంతో గ్యాస్ లారీల రాకపోకలు నిలిచిపోయాయి. ముడి చమురు లభ్యత తగ్గడమే ఈ భారీ సరఫరా కోతకు కారణమని విశ్వసనీయ వర్గాల సమాచారం. చర్లపల్లిలోని ఈ మూడు ప్రధాన ప్లాంట్ల నుంచి కేవలం తెలంగాణతో పాటూ పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు కూడా భారీగా చమురు, గ్యాస్ సరఫరా అవుతుంది. తాజాగా సరఫరా తగ్గడంతో ఆయా రాష్ట్రాలకు వెళ్లాల్సిన వాహనాలు ప్లాంట్ల వద్దే బారులు తీరాయి.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది: మోడీ



**కేరళ:** కేరళ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ కాంగ్రెస్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై కాంగ్రెస్ రాజకీయం చస్తోందని మండిపడ్డారు. దేశంలో జరగుతున్న అభివృద్ధి గురించి వారికి తెలియడం లేదన్నారు. ఒకవైపు, బీజేపీ-ఎన్‌డీఏ దేశాన్ని 'ఆత్మనిర్భర్'గా మార్చడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తుంటే, కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆత్మనిర్భర భారత్ అభియాన్‌ను అపహాస్యం చేయడంలో బిజీగా ఉన్నాయన్నారు. వారు దేశాన్ని విదేశాలపై ఎక్కువగా ఆధారపడేలా చేశారని కాంగ్రెస్?ను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పుడు కాంగ్రెస్, విపక్షాలు కలిసి అసత్యాలను ప్రచారం చేయడంలో నిమగ్నమై ఉన్నారన్నారు. కేరళలో పర్యటించిన ప్రధాని ఎర్నాకుళంలో 10 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కొచ్చి రిఫైనరీలో 5 వేల 500 కోట్లతో నిర్మించనున్న పాలీప్రొఫైలిన్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. యుద్ధ సమయంలో కూడా, కాంగ్రెస్, వామపక్షాలు భయాందోళనలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. మరోవైపు, కృత్రిమ మేధస్సు, సాంకేతికతకు కేరళను కేంద్ర బిందువుగా మార్చడానికి బీజేపీ కృషి చేస్తుందని మోదీ అన్నారు. నేటి భారతదేశం తన పౌరులను వేరే చోట చిక్కుకుపోనివ్వదని, గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకున్న భారతీయులకు అన్ని రకాల సహాయం అందించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు బాధితులతో నిరంతరం సంప్రదింపులు చేస్తూ వారికి సాయం చేస్తున్నాయని వెల్లడించారు. "గల్ఫ్‌లోని మిత్రదేశాల ప్రభుత్వాలు మన పౌరులను జాగ్రత్తగా చూసుకుంటున్నాయి. నేను ఆయా దేశాలకు ధన్యవాదాలు చెబుతున్నాను. ఆ దేశాల్లోని మన రాయబార కార్యాలయాలు, మిషన్లు వారికి నిరంతరం సహాయం అందిస్తున్నాయి. ఎవరికైనా ఆహారం కావాలన్నా, వైద్య సాయం కావాలన్నా, నివాసానికి సాయం కావాలన్నా, చట్టపరమైన సాయం కావాలన్నా అందిస్తున్నాం. కానీ ఇంతపెద్ద సంక్షోభంలో కూడా కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేయడం దురదృష్టకరం. మన ప్రజలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోతే ఈ వ్యక్తులు (కాంగ్రెస్ నేతలు) మోదీని తిట్టడానికి రీల్స్ చేస్తున్నారు" అని మోడీ తెలియజేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## ఏపీలో అంతర్జాతీయ స్థాయి అగ్రికల్చర్ స్కూల్

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. సమావేశానికి మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, కలెక్టర్లు హాజరయ్యారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, పది సూత్రాలు, స్వచ్ఛాంధ్ర, జీఎస్డీపీ లక్ష్యాలపై చర్చించారు. జిల్లాల్లో విజయవంతమైన కార్యక్రమాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పీపీపీ ప్రాజెక్టులు, ఆర్టీజీఎస్, సుపరిపాలనలో సాంకేతికత, పెట్టుబడులు, వైద్యారోగ్యం, సూపర్ సిక్స్ పథకాలపై సదస్సులో చర్చించారు. విద్యుత్ రంగంలో ట్రూఅప్ నుంచి ట్రూడౌన్‌కు తీసుకొచ్చినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విద్యుత్ రంగంలో నూతన సంస్కరణలు అమలు చేసి విజయం సాధించామన్నారు. మైక్రో గ్రిడ్‌ను బలోపేతం చేసి ప్రజలపై భారం తగ్గించాలని అధికారులకు సూచించారు. ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త రావాలని లక్ష్యం పెట్టుకున్నారని, అంతేకాకుండా కొత్త ఆవిష్కరణలకు అన్ని విధాలా సాయం అందించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెట్టామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ ఏడాది లక్ష్యాల కింద 15 పాయింట్లు తీసుకొస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. 20 నెలల్లో సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు ఇతర కార్యక్రమాలు అమలు చేశామన్నారు. పారదర్శకతను ప్రాధాన్యతగా తీసుకున్నామని వివరించారు. ఎక్కడా చిన్న తప్పు లేకుండా ముందుకెళ్తున్నామన్నారు. రైతు సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, రైతన్న మీకోసం కార్యక్రమం మరింత ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి చేయాలంటే అనేక అవకాశాలు ఉంటాయన్న సీఎం, ఫర్వాలేదు అనే ఉదాసీనత ఉంటే ముందుకు వెళ్లలేమని అధికారులతో అన్నారు. ఒక్కోసారి మనం తీసుకున్న నిర్ణయాలు దీర్ఘకాలంలో ఫలితాలు ఇస్తాయని వాటిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ వెళ్తే మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. 'ఒకప్పుడు విజన్ 2020 పెడితే చాలామంది విమర్శించారు, నా విజన్ సాధ్యమైన తర్వాత ప్రతిఒక్కరూ విజన్ 2047తో ముందుకెళ్తున్నారు. కొత్త ఆలోచనలు పంచుకుందాం, వాటిని సరైన దారిలో అమలు పరుద్దాం. స్పష్టత, సమన్వయం లేకపోతే అనుకున్న ఫలితాలు రావు. అందరం సమష్టిగా పనిచేసి నూతన సంస్కృతికి శ్రీకారం చుట్టాం. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు సంక్షేమం ఇస్తూనే ఉండాలి. ఈ 20 నెలల్లో చాలా అభివృద్ధి సాధించగలిగాం. ఇదే విధానం కొనసాగిస్తూ మరింత శ్రద్ధతో పని చేయాలి.' - అని చంద్రబాబు తెలియజేశారు. ప్రతి వ్యవసాయదారుడికి ఏఐ అగ్రానమిస్ట్ సేవలూ అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమర్థ నీటి నిర్వహణ చాలా కీలకమైన అంశమని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటి భద్రత కోసం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయని, గడిచిన 2 నెలల్లో 1.82 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగాయన్నారు. మార్చి 1 నాటికి 8.10 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయన్నారు. 90 రోజులపాటు ఏప్రిల్ 1 నుంచి జూన్ నెలాఖరు వరకూ నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా కాల్వల పూడికలు, చెరువుల లింకేజ్ వంటి కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 614 టీఎంసీల నీళ్లు రిజర్వాయర్లలో ఉన్నాయని వెల్లడించారు.వచ్చే ఆర్థిక ఏడాదికి సాగు సీజన్‌ను ముందుకు తీసుకొచ్చేలా ప్రణాళిక సిద్ధం చెయ్యాలన్నారు. వెలుగొండను జులై నాటికి పూర్తిచేసి నీటిని ఇస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టును 2027లో పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో ప్రాజెక్టులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయనున్నట్లు వివరించారు. 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా తయారు చేస్తామని స్పష్టం చేశారు. వాస్తవాలన్నీ పోర్టల్‌లో పెడితే వివాదాలు తగ్గుతాయని, పీజీఆర్ఎస్ ద్వారా ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారం కావాలన్నారు. భూ వివాదాలు లేకపోతే 70 శాతం సమస్యలు తగ్గుతాయని సీఎం చంద్రబాబు అన్నారు ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలపై ఆవేదన వ్యక్తం చేసిన సీఎం, బాణసంచా ప్రమాదం, డయేరియా, పాల కల్తీ ఘటనలు తననెంతగానో బాధించాయన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలను సూచించారు. కలెక్టర్లు, కార్యదర్శులు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని, ప్రజల ప్రాణాలు లెక్కచేయకుండా వ్యవహరిస్తే కఠినంగా ఉంటానన్నారు. నీరు కలుషితం, పాలు కల్తీ అవుతుంటే ఆయా విభాగాలు ఏం చేస్తున్నాయి? బాణసంచా నిబంధనలకు విరుద్ధంగా తయారు చేస్తుంటే ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు.

# నిర్మించి రెండేళ్లు కాకమునుపే పగళ్లు ఇచ్చిన 'అంతాడ - పి.కొత్తపల్లి' రోడ్డు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** మండలంలోని కొత్తపల్లి గ్రామానికి రహదారి నిర్మించాలని గ్రామస్థులు దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్నారు. అయితే రోడ్డు నిర్మించిన రెండేళ్లకే ఎక్కడికక్కడ పగుళ్లు ఇచ్చి అధ్వానంగా తయారవుతుండడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. తమ రవాణా కష్టాలు తీరాయని ఆనంద పడుతున్న తరుణంలో రోడ్డు దుస్థితిని చూసి కలత చెందుతున్నారు. మండలంలోని బంగారమ్మపేట నుంచి అంతాడ పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి సరైన రహదారి లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాకపోకలకు అవస్థలు పడుతుండేవారు. తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని దశాబ్దాల పాటు పోరాటం చేశారు. ఈ క్రమంలో 2021లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ఆర్థిక సహకారంతో రూ.2.63 కోట్ల అంచనా వ్యయంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో రోలుగుంట మండలానికి చెందిన కాంట్రాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. 2023 ఏప్రిల్‌లో ఈ రహదారి నిర్మాణం పూర్తయింది. అయితే రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో అంతాడ రోడ్డు నుంచి కొత్తపల్లి వెళ్లే 4.5 కిలోమీటర్ల మేర పలు చోట్ల రోడ్డు పగుళ్లు ఇచ్చింది. అలాగే రోడ్డు అంచులు సైతం కొట్టుకుపోయాయి. దీంతో కొత్తపల్లి గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు వెళితే రోడ్డు కుంగిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయ్యాక ఐదు సంవత్సరాల పాటు నిర్వహణ నిమిత్తం కాంట్రాక్టర్ రూ.9 లక్షలు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో డిపాజిట్ చేశారు. ప్రస్తుతం ఈ రహదారి పలు చోట్ల పగుళ్లు ఇచ్చిన నేపథ్యంలో ఆ డిపాజిట్ సొమ్ముతో మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

## జీలుగులపాడు సమీపంలో పూర్తయిన వంతెన

### 30 గ్రామాల ప్రజలకు ఊరట



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ జీలుగులపాడు సమీపంలో గోస్తని నదిపై వంతెన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రావడంతో 30 గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరాయి. భారీ వర్షాలు కురిసేటప్పుడు నాటు పడవలపై గిరిజనులు ఎన్నో దశాబ్దాలుగా ప్రయాణాలు సాగించారు. గోస్తని నదిని దాటే క్రమంలో పలువురు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. గత ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి ఎస్‌సీపీ గ్రాంటు కింద రూ.2.2 కోట్లు కేటాయించింది. అయితే 70 శాతం వరకు పనులు వేగంగా సాగినప్పటికీ ఆ తరువాత వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టింది. మూడు నెలల క్రితం వంతెన పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చింది. దీంతో జిల్లాలోని చిలకలగెడ్డ, రొంపల్లి పంచాయతీల్లోని మర్రివలస, పసిని, గాదిల్లోవ, చినరాభ, పెదరాభ, సోట్టాడివలస, దబ్బలపాడు, కోటపర్తివలస, రొంపల్లి, కరకవలస గ్రామాలతో పాటు విజయనగరం జిల్లా గంట్యాడ మండలం డీకేపర్తి, ముసలకండి, అడ్డతీగ, బీటుగరువు, రేగలపాలెం, అలిపర్తి, ఎగువకొండపర్తి, పెదపాడు, గ్రామాల గిరిజనులకు రవాణా కష్టాలు తీరాయి.

## భయంలో శరభవరం.. ఆవును చంపిన పెద్ద పులి



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** రాజవొమ్మంగి మండలంలోని మారేడు బాక పంచాయితీ జి.శరభవరం గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఆవుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .... తెల్లవారుజామున జి.శరభవరం గ్రామ సమీపంలో కోసురి వీధికి చెందిన గణపతి అనే మహిళకు చెందిన ఆవుపై పులి దాడి చేసింది. ఆవు మెడ భాగంలో తీవ్ర రక్తస్రావంతో కూడిన గాయమైంది. ఆ సమయంలో అలజడి ఉండడంతో పులి ఆవును వదిలి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. పెద్ద పులి కదలికలు ఈ ప్రాంతంలో ఉన్న నేపథ్యంలో అటవీశాఖ సబ్ డీఎఫ్‌ఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రాజవొమ్మంగి రేంజర్ ఉషారాణి, ఫారెస్ట్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. పులి దాడి చేసి హతమార్చిన ఆవును, ఆ ప్రాంతాన్ని సబ్ డి ఎఫ్ ఓ సుబ్బారెడ్డి ఫారెస్ట్ సిబ్బంది ఈరోజు పరిశీలించారు. పులి పాదముద్రలను గుర్తించారు. పోలవరం జిల్లాలో భయం పుట్టిస్తున్న పెద్దపులి బోనులో చిక్కకుండా హల్ చల్ చేస్తూనే ఉంది. రాజవొమ్మంగి మండలం మారేడుబాక మండలం జీ.శరభవరం గ్రామం పరిసరాల్లో నేడు పులి కదలికలు రికార్డ్ అయ్యాయని సుబ్బారెడ్డి తెలిపారు.

## టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు నిర్ణీత రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఇప్పటికే మండల కేంద్రాలకు తరలించి పోలీసు స్టేషన్లలో భద్ర పరిచారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 14,309 మంది, ప్రైవేటు స్కూళ్ల నుంచి 6,268 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. వీరితోపాటు గత ఏడాది పదో తరగతి పరీక్షలో ఫెయిల్ అయిన 440 మంది కంపార్ట్‌మెంట్ విద్యార్థులు కూడా పరీక్షలు రాయనున్నారు. మొత్తం 21,017 మంది విద్యార్థుల కోసం 102 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల పర్యవేక్షణకు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. మండల విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణలో చూసిరాతలకు తావులేకుండా పరీక్షల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తారు. కాగా పరీక్షలు జరిగే రోజుల్లో పదో తరగతి విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు రాకపోకలు సాగించేందుకు ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్ల హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని అధికారులు ప్రకటించారు. పరీక్ష ప్రారంభం కావడానికి గంట ముందు నుంచి, పరీక్ష ముగిసిన గంట తరువాత వరకు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా బస్సులు నడపాలని కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'వంద రోజుల ప్రణాళిక'ను అమలు చేశారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠ్యాంశాల వారీగా చదివించి, టెస్టులు పెడుతున్నారు. గత నెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. తగిన మార్కులు రాని విద్యార్థులను సమీపంలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉంచి చదివిస్తున్నారు.

## నెట్టారు: జగన్

(మొదటిపేజీ తరువాయి)

5.089కి పెరిగిందని గణాంకాలు వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పడిపోవడానికి 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానమే కారణమని జగన్ విమర్శించారు. లిక్కర్ మాఫియా నుంచి భూములు కట్టబెట్టడం వరకు అన్నింటా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. విశాఖలో రూ. 5 వేల కోట్ల విలువైన భూములను చంద్రబాబు తన బంధువులకు కట్టబెట్టారని, రియల్ ఎస్టేట్ సంస్థలకు తక్కువ ధరకు భూములు ఇస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా ట్రెజరీలో మినిమం బ్యాలెన్స్ కూడా ఉండటం లేదని, ఏడాదిలో కేవలం 8 రోజులు మాత్రమే కనీస నిల్వలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. 16 రోజుల అసెంబ్లీ సమావేశాల వల్ల ప్రజలకు జరిగిన మేలు సున్నా అని జగన్ అన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోగా, గతంలో తాము ఇచ్చిన పథకాలను కూడా రద్దు చేశారని మండిపడ్డారు.

## ఎండాడలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 60వ శాఖ ప్రారంభం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 60వ శాఖను ఎండాడ ప్రాంతంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ప్రారంభించారు. బ్యాంకు చైర్మన్ జెవి.సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహకార అధికారి టి.ప్రవీణ, సుప్రసిద్ధ సహకారవేత్త బ్యాంకు మార్గదర్శకులు మానం ఆంజనేయులు, సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు పిఆర్‌విపిఎస్.రంగరాజు, ఎపి కో-ఆపరేటివ్ బ్యాంకులు, సహకార సంఘాల ఫెడరేషన్ డైరెక్టర్, ఎపి టఫ్కబ్ సభ్యులు ఎం.వెంకటరత్నం, శ్రీ కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, మహారాజా కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎంఆర్‌కె.రాజు హాజరై తమ సందేశాలను అందించారు. బ్యాంకు చైర్మన్ జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ఈ బ్రాంచి ద్వారా రానున్న 5 సంవత్సరాల కాలంలో రూ.100 కోట్ల రుణాలు జారీచేయగలమని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు వీరగంట చంద్రశేఖర, జనార్ధనరావు, ఆదినారాయణశాస్త్రి, ప్రసాదరావు, పార్వతీదేవి, కోటేశ్వరరావు, నారాయణస్వామి, డాక్టర్ కృష్ణమోహనరావు, చుక్కపల్లి రామారావు, ఆచార్య అంజయ్య, నరసింహమూర్తి, మల్లికార్జునరావు, శ్రీకాంతబాబు, సిఆర్.సుకుమార్, ముఖ్య కార్యనిర్వహణాధికారి వివిబి.వరలక్ష్మి, సభ్యులు, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఐద్వా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం విమాన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని 70 మంది మహిళలకు రొమ్ము కేన్సర్ టెస్టులు ఉచితంగా నిర్వహించారు. కేన్సర్ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాక్సిన్ గురించి డాక్టర్లు సౌజన్య, జ్యోతి వివరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, కేన్సర్ నివారణ గురించి అవగాహన సదస్సులు చాలా నిర్వహించామని చెప్పారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. డైటీషియన్ రమాదేవి మాట్లాడుతూ వ్యాయామం చేయటం వల్ల కేన్సర్‌ను చాలా వరకు నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వి.ప్రభావతి, నీలిమ, సుమిత్ర, సత్యవతి, ఉష, విజయలక్ష్మి, విమాన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేష్, సెక్రటరీ నాగు, రమేష్ పాల్గొన్నారు.

## బెల్లంపై కొత్త పరిశోధనలు: జగన్నాథరావు



**అనకాపల్లి పతాకం న్యూస్:** స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) పోస్టు హార్వెస్టు టెక్నాలజీ విభాగానికి మూడు కొత్త పరిశోధన ప్రాజెక్టులను భారత వ్యవసాయ పరిశోధన మండలి మంజూరు చేసింది. ఈ విషయాన్ని సంబంధిత విభాగాధిపతి డాక్టర్ పీవీకే జగన్నాథరావుఇక్కడ మీడియాకు తెలిపారు. బెల్లంలోని పోషక విలువలపై శాస్త్రీయ పరిశోధనలు జరిపి వాటిని ప్రమాణీకరించేందుకు ఒక ప్రాజెక్టు మంజూరైందని చెప్పారు. పంచదార కన్నా బెల్లం వినియోగం ఆరోగ్యానికి మంచిదేనా? బెల్లంలో ఐరన్ తదితర పోషక విలువలు ఉన్నాయా? అనే అంశాలపై శాస్త్రీయమైన ఆధారాల కోసం ఈ పరిశోధన జరుగుతుందని జగన్నాథరావు వివరించారు. బెల్లంలో గ్లైసిమిక్ ఇండెక్స్‌పై కూడా పరిశోధనలు చేపడతామన్నారు. బెల్లం నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పరిశోధనలు చేపట్టేందుకు మరొక ప్రాజెక్టు కూడా మంజూరు అయ్యిందన్నారు. అల్లం రసం, పసుపు కొమ్ముల నుంచి తీసిన నూనె, మునగాకు రసం వంటి వాటిని బెల్లం తయారీలో ఉపయోగించడం వల్ల నిల్వ సామర్థ్యం పెరుగుతుందా? అన్న వాటిపై పరిశోధిస్తామన్నారు. ఎలాంటి ప్యాకేజింగ్ సామగ్రిని ఉపయోగిస్తే బెల్లం నిల్వ, రవాణా మెరుగ్గా వుంటాయన్న అంశంపై పరిశోధిస్తామన్నారు.

## జాబ్ కేలండర్ విడుదల చేయాలి : డివైఎఫ్ఐ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ కేలండర్ విడుదల చేయాలని, గత ఐదేళ్లుగా రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున నిరుద్యోగుల వయోపరిమితి 47కు పెంచాలని డివైఎఫ్ఐ నాయకులు రాజు, శ్రావణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బిర్లా జంక్షన్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు నోటిఫికేషన్లు లేవన్నారు. మూడు నెలలు క్రితం ముఖ్యమంత్రి 4.71 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారని, ఇప్పుడు యువజన సర్వీసుల శాఖ మంత్రి ఏకంగా 6.28 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని ప్రకటించడం యువతను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. కేవలం కార్పోరేట్ సంస్థలు ఇచ్చే కమిషన్ కోసం రాష్ట్రంలో ఉండే విలువైన భూములను లూటీ చేసి వారికి అప్పగించి బయట మాత్రం ఉద్యోగాలు వస్తాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరుగుతుంటే అసెంబ్లీలో చర్చించి యువతకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం లడ్డు చుట్టూ రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు, లైబ్రరీయన్ పోస్టులు, యానిమల్ హస్బెండరి అసిస్టెంట్ పోస్టులను, ఇంజినీరింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పది వేలకుపైగా పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో గత ఐదేళ్లుగా 4వేలకు పైగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు, సంతోష్, రమేష్, దేవుడు, శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జీవీఎంసీ ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం ఈనెల 17తో పూర్తికానుంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ పాలనా వ్యవహారాలను చక్కదిద్దడంతోపాటు కమిషనర్‌కు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. ఈ ఉత్తర్వులు ఆరు నెలలపాటు అమలులో ఉంటాయని, ఆలోపు ఎన్నికలు జరిగితే రద్దవుతాయని పేర్కొంది.

## స్టీల్‌ప్లాంట్ ఆపరేషన్స్ డైరక్టర్‌గా సుభాసిస్ సేన్‌గుప్తా

**గాజువాక, పతాకం న్యూస్:** రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సుభాసిస్ సేన్ గుప్తా ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం దుర్గాపూర్‌లోని సెయిల్‌లో చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్)గా పనిచేస్తున్నారు. ఆర్ఐఎన్ఎల్ ప్రస్తుత ఆపరేషన్స్ డైరెక్టర్ పురుషోత్తం త్వరలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో అర్హులైన వారిని ఎంపిక చేయడానికి కేంద్ర కమిటీ దరఖాస్తులు ఆహ్వానించి, మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించింది. మొత్తం 12 మంది హాజరు కాగా వారిలో సుభాసిస్ సేన్‌గుప్తా ఎంపికయ్యారు. వచ్చే నెలలో బాధ్యతలు స్వీకరిస్తారు.

# విద్యుత్ యూనిట్ల నిర్మాణానికి 10 వేల టన్నుల ఇసుక



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలోని అప్పర్, లోయర్ సీలేరులో విద్యుదుత్పాదనలో భాగంగా రెండు కొత్త యూనిట్ల నిర్మాణానికి పది వేల టన్నుల ఇసుకను సేకరించుకోవచ్చునని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. సీలేరులో కొత్తగా నిర్మించే 115 మెగావాట్ల రెండు కొత్త యూనిట్లకు ఇసుక సేకరణపై అనకాపల్లి కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయం నుంచి మైనింగ్, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.

ఇసుక సేకరణ క్రమబద్ధీకరించాలని, నిర్దేశించిన రీచ్‌లలోనే ఇసుకను సేకరించాలన్నారు. భారీ నిర్మాణాలైన అప్పర్, లోయర్ సీలేరులో రెండు యూనిట్ల కోసం గుమ్మ, కొత్తగూడెం ప్రాంతాల్లోని రీచ్‌లలో ఇసుకను సేకరించాలన్నారు. కొత్త యూనిట్ల నిర్మాణం నాణ్యతతో పాటు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు శ్రీపూజ, స్మరణ్‌రాజ్, శుభం నొక్వాల్, మైనింగ్ ఏడీ ఆనంద్, డీఆర్వో అంబేద్కర్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ జి.డేవిడ్‌రాజు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈ టి.కొండయ్య పడాల్, వివిధ శాఖల అధికారులు తపాల్గొన్నారు.

## పంచాయతీల వర్గీకరణ



**అనకాపల్లి, పతాకం న్యూస్:** గ్రామ స్థాయిలో పరిపాలనను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థలో పలు మార్పులు తీసుకువస్తున్నది. జనాభా ఆధారంగా ఇంతవరకు మేజర్, మైనర్ పంచాయతీలు వుండగా... ఇకపై జనాభాతోపాటు ఆదాయం, విస్తీర్ణం ఆధారంగా పంచాయతీలను నాలుగు రకాలుగా... రూర్బన్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3గా వర్గీకరించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. జనాభా పదివేలకు పైబడి వుండి, ఏటా కోటి రూపాయలకు మించి ఆదాయం వచ్చే పంచాయతీలను రూర్బన్‌గా ప్రకటించింది. మూడు వేలకు మించి, పది వేల లోపు జనాభా వుండి, రూ.30 లక్షలకు పైబడి వార్షిక ఆదాయం వున్న పంచాయతీలను గ్రేడ్-1గా, రెండు నుంచి మూడు వేల మధ్య జనాభా వున్న పంచాయతీలను గ్రేడ్-2గా, రెండు వేలకన్నా తక్కువ జనాభా వున్న పంచాయతీలను గ్రేడ్-3గా విభజించింది. జిల్లాలో ప్రస్తుతం 646 గ్రామ పంచాయతీలు వుండగా, వీటిలో 13 పంచాయతీలు మాత్రమే రూర్బన్ కేటగిరీలో వున్నాయి. మిగిలిన వాటిలో గ్రేడ్-1లో 112, గ్రేడ్-2లో 169, గ్రేడ్-3లో 352 పంచాయతీలు వున్నాయి. వర్గీకరణ తరువాత ఆయా గ్రామ పంచాయతీలకు నిధుల కేటాయింపు, సిబ్బంది నియామకం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో తగిన ప్రాధాన్యం ఇస్తారు. మండల కేంద్రాలైన చోడవరం, కశింకోట, మాడుగుల, పాయకరావుపేట, సబ్బవరంతోపాటు అనకాపల్లి మండలం తుమ్మపాల, అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం, పూడిమడక, వైఎస్సార్ నగర్, పరవాడ మండలం ఇ.బోనంగి, తానాం, రాంబిల్లి మండలం లాలం కోడూరు, రావికమతం మండలం కొత్తకోట పంచాయతీలను రూర్బన్‌గా గుర్తించారు.

## యూనిఫైడ్ సర్వే పూర్తి చేయాలి



**కోటబొమ్మాళి, పతాకం న్యూస్:** గొర్రెలు, మేకల సహకార సంఘాల్లో మహిళలకు సభ్యులుగా నమోదుచేయాలని టెక్కలి పశువైద్య ఉప సంచాలకుడు డాక్టర్ చందక నరసింహులు తెలిపారు. కోటబొమ్మాళిలో కోటబొ మ్మాళి, జలుమూరుమండలాల పశు వైద్యాధికారులు, పారాసిబ్బంది, ఏహెచ్‌వోలు, గోపాలమిత్రలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన యూనిఫైడ్ సర్వే శతశా తం పూర్తిచేయాలని, ప్రతినెలా క్రమం తప్పకుండా పిరియాడికల్ నివేదికలు ఇవ్వాలని కోరారు. పిల్లిముసర, గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయాలని, పశువైద్య శిబిరాలు జరిగే సమయంలో వలస వెళ్లిన సన్నజీవాల పెంపకందా రులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలని సూచించారు. పేడ, రక్త పరీక్ష సమూనాలను టెక్కలిలో నెలకొల్పిన పరీక్ష కేంద్రానికి తీసుకువెళ్లి అక్కడ ఉచితంగా పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పశు వైద్య సహాయ సంచాలకులు మంద లోకనాథం, పశువైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, ఎం. ప్రజ్ఞచైతన్య, ఎం.దీప్తి, కొటబొమ్మాళి, జలుమూరు పారా వెట్ సిబ్బంది, రైతు సేవక్ కేంద్ర పశు సంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## 17 నుంచి కొత్త అమావాస్య జాతర



**కొత్తూరు, పతాకం న్యూస్:** స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఈ నెల 17వ తేదీన ప్రారంభం అవుతుందని ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను చెప్పారు. ఆలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశలో ఆయన మాట్లాడుతూ.. నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించినందున అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే నెల 17వ తేదీ వరకు జరిగే ఈ జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 17వ తేదీ రాత్రి జాతర ఆరంభం అవుతుందని, 18వ తేదీన కొత్త అమావాస్య పండుగ సందర్భంగా నూకాంబిక అమ్మవారికి ప్రభుత్వం తరపున జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలియజేశారు. ఏప్రిల్ 1న ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో చాగంటి కోటేశ్వరరావుతో ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సమావేశంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి సుధారాణి, ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్, ధర్మకర్తలు సూరే సతీశ్‌కుమార్, దాడి రవికుమార్, మారిశెట్టి శంకరరావు, కొడుకుల శ్రీకాంత్, కాంద్రేగుల రాజారావు, పొలిమేర స్వామి ఆనంద్‌కుమార్, వద్దాది మంగ, మజ్జి జానకి, యర్రవరపు సంతోషికుమారి, కోనేటి సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

## హోటళ్లపై పౌరసరఫరాల శాఖ దాడులు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో పలు హోటళ్లలో అక్రమంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లపై పౌరసర ఫరాల శాఖ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో 24 గృహ అవసర ఎల్‌పిజి సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా సరఫరా అధికారి తెలిపిన వివరాల ప్రకారం గృహావసరాల కోసం ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే సిలిండర్లను కొందరు హోటల్ యజమానులు వాణిజ్య అవసరాలకు మళ్లిస్తున్నట్లు సమాచారం అందింది. దీనిపై అధికారులు ఆరు హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించి, సదరు హోటల్ యజమానులపై నిత్యావసర వస్తువుల చట్టం కింద 6-ఎ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సరఫరా అధికారి మాట్లాడుతూ సబ్సిడీ సిలిండర్లను వాణిజ్యపరంగా వాడడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు, గృహ అవసరాలకు అందాల్సిన గ్యాస్‌ను అక్రమంగా మళ్లిస్తే సహించేది లేదన్నారు. ఎక్కడైనా గ్యాస్ సిలిండర్ల అక్రమ విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే టోల్-ఫ్రీ నంబర్ 1967కు గానీ, లేదా స్థానిక పౌరసరఫరాల కార్యాలయంలో గానీ ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ దాడుల్లో ఎఎస్ఒ ప్రదీప్ చంద్ర, డిప్యూటీ తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, జూనియర్ అసిస్టెంట్లు అజరు, తేజ పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల సంక్షేమం కోసం రసాయన శాస్త్రంలో పరిశోధనలు అవసరం : ప్రముఖ శాస్త్రవేత్త గిరిబాబు



**విజయనగరం, పతాకం న్యూస్:** భవిష్యత్ తరాల సంక్షేమం కోసం రసాయన శాస్త్రంలో పరిశోధనలు అవసరం అని ప్రముఖ శాస్త్రవేత్త గిరిబాబు చెప్పారు. బుధవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఆరోగ్యం, శక్తి పర్యావరణ పరిరక్షణ కోసం సుస్థిర రసాయన శాస్త్రం (ఎస్ సిహె చ్ ఈ ఈ -- 2026)" అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ఈరోజు ప్రారంభమైంది. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొ.ఎం.శరత్చంద్రబాబు స్వాగత ప్రసంగం చేసి సదస్సు ప్రాముఖ్యతని, లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సి.ఎస్.ఐ.ఆర్, హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.గిరిబాబు మాట్లాడుతూ .... భవిష్యత్ తరాల సంక్షేమం కోసం స్థిరమైన రసాయన శాస్త్ర పరిశోధనలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, శక్తి వనరుల సమర్థ వినియోగం, పచ్చశక్తి అభివృద్ధి, ఆరోగ్య రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి ఈ రంగంలోని పరిశోధనలు ఎంతో తోడ్పడుతున్నాయని ఆయన తెలిపారు. శాస్త్రవేత్తలు పర్యావరణానికి అనుకూలమైన పరిశోధనలను చేపట్టాలని సూచించారు. ముఖ్య ప్రసంగం ఐఐటి మద్రాసు కి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొ. పి.అబ్బరసన్ మాట్లాడుతూ .... ఆధునిక సమాజ అవసరాలను తీర్చడంలో స్థిరమైన రసాయన శాస్త్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆరోగ్య సంరక్షణ, శక్తి ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో మరింత విస్తృతంగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు పరస్పరం సహకారంతో పనిచేస్తే సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు వెలువడతాయని తెలిపారు. తదుపరి ప్రసంగించిన ఐసర్ బెర్హాంపూర్ కి చెందిన ప్రొ.జి.రామకృష్ణ భట్ మాట్లాడుతూ .... పర్యావరణానికి హాని కలగకుండా రసాయన పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడం ఈ కాలంలో అత్యవసరమని అన్నారు. పర్యావరణానికి అనుకూలమైన సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో యువ పరిశోధకులు ముందుకు రావాలని ఆయన సూచించారు. విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ .... స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో శాస్త్రీయ పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇలాంటి జాతీయ సదస్సులు శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకుల మధ్య జ్ఞాన మార్పిడి, పరస్పర చర్చలకు వేదికగా నిలుస్తాయని ప్రసంగించారు.

## మౌలిక వసతులు కల్పించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** గుంకలాం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి, స్థానికుల సమస్యలు పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఆ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అతి పెద్ద మూడో కాలనీగా పేరుగాంచిన గుంకలాం జగనన్న లేఅవుట్‌లో కనీసం మౌలిక వసతులు లేవన్నారు. ప్రధాన రహదారి పాడైందని తెలిపారు. కాలనీలో 12,976 ఇళ్లు మంజూరు చేశారని, సుమారు 879 మంది ఆరు బ్లాకుల్లో నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇక్కడ చదువుకునేందుకు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాలు లేవని, తాగునీటి సౌకర్యం కల్పించలేదని చెప్పారు. దొంగల బెడద తీవ్రంగా ఉందన్నారు. నైట్ పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు శాంతి, సుధామాధవి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అనధికార నిర్మాణాలను తొలగించండి



**విజయనగరం, పతాకం న్యూస్:** నగరంలో అనధికార కట్టడాలు, ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ బాలస్వామి స్పష్టంచేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. కొన్నిచోట్ల కాలువలు నిండిపోవడాన్ని గమనించి వెంటనే పూడికలు తొలగించాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు. కాలువలపై పలకలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలపై ఉన్న పలకలను ఆక్రమించి తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలను చేపట్టరాదన్నారు. అటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని చెప్పారు. అన్న క్యాంటీన్‌కు విరాళంవిజయనగరం టౌన్ : నగరంలోని గుంటూరువారి వీధికి చెందిన బైసాన రామారావు అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.3 వేలు విరాళాన్ని మంగళవారం సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజుకు అందజేశారు. అన్న క్యాంటీన్లు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రజలు విరివిగా విరాళాలు అందివ్వాలని అప్పలరాజు కోరారు.

## లొంగిపోయిన 108 మంది మావోయిస్టులు




**ఛత్తీస్‌గఢ్:** 108మంది మావోయిస్టులు లొంగిపోయారని ఛత్తీస్‌గఢ్ అధికారులు బుధవారం తెలిపారు. వారిపై రూ.3.95కోట్ల రివార్డు ఉందని అన్నారు. దంతెవాడ నుండి 30మంది, సుక్మా నుండి 18మంది, బస్తర్ నుండి 16మంది, నారాయణపూర్ నుండి నలుగురు మరియు కాంకెర్లో నుండి ముగ్గురు లొంగిపోయారని, వీరంతా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన వారని భద్రతాదళాలు తెలిపాయి. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమాండర్లు ఉన్నారని, ఒక్కొక్కరిపై ఎనిమిది లక్షల వరకు రివార్డు ఉందని పేర్కొన్నాయి. వారి ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించాయి.

# ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్... బెంగళూరు తర్వాత ముంబైలో 20 శాతం హోటళ్లు బంద్




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం నిత్యావసర వస్తువులపై భారీగా పడుతోంది. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉండటం లేదంటూ బెంగళూరులో హోటల్స్ అసోసియేషన్ ఈరోజు నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను మూసివేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబైలో కూడా 20 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడ్డాయి. ఈ మేరకు ముంబై హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలో సగం హోటళ్లు మూతపడతాయని ఆందోళన వ్యక్తం చేసింది. వాణిజ్య సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో ఢిల్లీ, బెంగళూరు సహా వివిధ నగరాల్లో పలు హోటళ్లను తాత్కాలికంగా మూసివేశారు. సిలిండర్ల కొరత కారణంగా తమ వ్యాపారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరత వల్ల కొన్ని ప్రాంతాల్లో బ్లాక్‌లో విక్రయాలు జరుగుతున్నాయి. బ్లాక్‌లో విక్రయాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతం ఉన్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వ శాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసింది.

# గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ పోస్టర్లు ఆవిష్కరణ



**పాలకొండ, పతాకం న్యూస్:** బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ పాలకొండలో నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు బి.అమరవేణి అధ్యక్షతన జరిగిన పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ యుద్ధం సాకుతో గ్యాస్ ధర పెంచడం వల్ల, సామాన్య మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండించారు. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధం వల్ల గ్యాస్ ధరలు పెంచాల్సి వచ్చిందని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు పెద్ద కానుక ఇచ్చారని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలు తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్యామల, జి.శారద, కె. శారద, ఎల్. జయమ్మ, ఎస్. రజిని, జి. జెస్సీబారు, రాధా రాణి , ప్రభావతి, పి.శ్రీదేవి, ధనలక్ష్మి, గౌతమి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టు బాధితులకు అండగా నిలుస్తా: ఎమ్మెల్యే శిరీష



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:**ఎయిర్‌పోర్టు బాధిత రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించి, వారి పిల్లలకు తాను అండగా నిలుస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. మందస మండలం రాంపురం గ్రామ సచివాలయ భవనంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్గో ఎయిర్‌పోర్టు అంటూ కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇది పూర్తిస్థాయిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అని చెప్పారు. ఇక్కడి నుంచి అన్నిరకాల విమానాల రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. ఎక్కువగా సాయం అందించి, పునరావాసం కల్పిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, కొర్ల కన్నారావు, దాసరి తాతారావు, సాలిన మాధవరావు, జానకిరావు, లబ్బ రుద్రయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు. పలాసలోని కేంద్రీయ విద్యాలయంలో పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. రైల్వే పాఠశాల తాత్కాలికంగా ఏర్పాటుచేస్తున్న కేంద్రీయవిద్యాలయా న్ని పరిశీలించారు. అక్కడ తరగతుల నిర్వహణకు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉం డేందుకు తాత్కాలిక క్వార్టర్ల ఏర్పాటుగురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్రీయ విద్యా విభాగం నిబంధనల మేరకు అడ్మిషన్లు జరుగుతాయని చెప్పారు. ఆమె వెంట ఆర్డీవో అప్పలరాజు, తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ కార్యదర్శి సప్ప నవీన్, గాలి కృష్ణారావు, మల్లిపెద్ది చిన్ని ఉన్నారు.

# 12 నుంచి కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




బాలికల విద్యకు పెద్దపీట వేసిన కస్తూర్బా గాంధీ విద్యాలయాలు కార్పొరేటు పాఠశాలలకు దీటుగా రాణిస్తున్నాయి. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్యను ఆంగ్ల మాధ్యమంలో ఇక్కడ అందిస్తున్నారు. విద్యార్థినులకు పాఠశాలలో మెరుగైన సదుపాయాలతో పాటు పోషకాహారం అందుతుంది. 24 గంటలూ ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది. బాలికలు క్రమశిక్షణతో విద్యలో రాణిస్తున్నారు. నాడు డ్రాపౌట్(పాఠశాల నుంచి దూరమైన) విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీల్లో ప్రస్తుతం రెగ్యులర్ విద్యార్థుల ప్రవేశాల కోసం క్యూ కడుతున్నారంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది ప్రవేశాలకు ఈ నెల 12 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీలకు చెందిన బాలికలకు నాణ్యమైన విద్యను అందించాలని 2004 ఆగస్టులో కస్తూర్బాగాం?ధీ బాలికా విద్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలకు దూరమైన విద్యార్థినుల సంఖ్యను తగ్గించేందుకు వసతితో కూడిన విద్యాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ పాఠశాలను 2008 ఏప్రిల్ ఒకటిన సర్వ శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ప్రోగ్రామ్‌లో విలీనం చేశారు. ఈ పాఠశాలలు ప్రస్తుతం సమగ్ర శిక్ష పర్యవేక్షణలో నడుస్తున్నాయి. ప్రతి మండలంలో బాలికల కోసం ఒక కేజీబీవీ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో ఒక తరగతిలో 40 సీట్లు ఉంటాయి. విద్యార్థినులకు విద్యాబోధనకు అర్హత కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు 12-14 మంది అందుబాటులో ఉన్నారు. విద్యార్థినుల ఆరోగ్యం పర్యవేక్షించి ప్రాథమిక చికిత్స అందించేందుకు ఏఎన్ఎం అందుబాటులో ఉన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధనకు శ్రీకారం చుట్టారు. ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ) అందుబాటులో ఉన్నాయి. పాఠశాలను విజువల్స్ రూపంలో ఐఎఫ్‌పీ, ట్యాబ్‌ల ద్వారా బోధిస్తున్నారు. ఈ విధానం వల్ల విద్యార్థినులకు కష్టమైన సబ్జెక్టులు సులభంగా అర్థమవుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంగ్లీష్ మీడియంలో బోధన ప్రవేశపెట్టడం వల్ల ఇక్కడ విద్యాభ్యాసం చేసిన విద్యార్థినులు పోటీ పరీక్షల్లోనూ రాణిస్తున్నారు. పాఠ్యాంశాల బోధనతో పాటు వృత్తి కోర్సుల్లోనూ విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నారు. కంప్యూటర్, కుట్టు, బ్యూటీషియన్ కోర్సుల్లో విద్యార్థినులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థినులకు విద్యతో పాటూ శారీరక, మానసిక వికాసానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి రోజు ఉదయం యోగా, సాయంత్రం క్రీడలు నిర్వహించడం వల్ల బాలికలు ఉత్సాంగా ఉంటున్నారు. ఆత్మరక్షణ కోసం బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ కరాటే శిక్షణ ఇస్తున్నారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనంలోనూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

విద్యార్థినులకు క్రమశిక్షణ కలిగిన టైం టేబుల్ అమలు చేస్తున్నారు. విద్యాలయంలో విద్యార్థినులు ప్రతి రోజు ఉదయం నాలుగు గంటలకు నిద్ర లేవాల్సి ఉంటుంది. కాలకృత్యాల అనంతరం ఐదు గంటలకు స్టడీలో కూర్చోవాలి. ఆరు గంటలకు నుంచి ఆరున్నర గంటల వరకు యోగా చేస్తారు. 6:30 గంటలకు రాగి మాల్ట్ ఇస్తారు. అనంతరం స్నానాలు పూర్తి చేసుకుంటారు. 8:30 గంటలకు అల్పాహారం పెడతారు. 9 గంటల నుంచి 15 నిమిషాల పాటు ప్రార్థన ఉంటుంది. 9:15 గంటలకు ఉదయం తరగతులు ప్రారంభమవుతాయి. ఒక్కొక్క తరగతి 50 నిమిషాలు ఉంటుంది. మధ్యాహ్నం 12:15 గంటలకు మధ్యాహ్న భోజనం ఉంటుంది. ఒంటి గంటకు తిరిగి మధ్యాహ్నం తరగతులు ప్రారంభమవుతాయి. నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు వెనుకబడిన విద్యార్థులకు బేసిక్(ప్రాథమిక విద్యాబోధన) అందిస్తారు. ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు విద్యార్థినులు క్రీడల్లో పాల్గొంటారు. 6:30 గంటలకు రాత్రి భోజనం ఉంటుంది. రాత్రి ఏడు గంటల నుంచి పది గంటల వరకు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్టడీ ఉంటుంది. అలాగే విద్యార్థినులు విద్యాభ్యాసం, వసతి కోసం నూతన భవనాలు అందుబాటులో ఉన్నాయి. తరగతిలో 40 మంది విద్యార్థినులు కూర్చోవడానికి అనువుగా గదులు ఉన్నాయి. ప్రతి విద్యార్థిని కూర్చోవడానికి డెస్కులు అందుబాటులో ఉన్నాయి. వసతి గృహాల్లోనూ విద్యార్థినులకు విశాలమైన గదులు ఉన్నాయి. ప్రస్తుతం విద్యార్థినులు పడుకోవడానికి బెడ్స్, బెడ్‌షీట్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది నుంచి ప్రతి విద్యార్థికీ బంకర్ బెడ్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. విద్యార్థినులకు వేడి నీళ్ల కోసం సోలార్ హీటర్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థినులకు తగిన మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయి. పూర్తి స్థాయిలో రన్నింగ్ వాటర్ ఉంది. వసతి గృహం చుట్టూ ప్రహరీ గోడలు ఉన్నాయి. విద్యార్థినులు సీసీ కెమేరాల పర్యవేక్షణలో ఉంటారు. పగలు, రాత్రి మహిళా పర్యవేక్షక సిబ్బంది అందుబాటులో ఉన్నారు. అలాగే విద్యాలయంలో విద్యార్థినులకు మంచి పోషకాహారం అందిస్తున్నారు. ఉదయం రాగి మాల్ట్‌తో దినచర్యను ప్రారంభిస్తారు. ప్రతి రోజు ఒక రకం అల్పాహారం ఉంటుంది. మధ్యాహ్నం పప్పు, ఆకు కూర, రసంతో పాటు శనివారం మినహా ప్రతి రోజు గుడ్డు ఇస్తారు. మధ్యాహ్నం, రాత్రి మజ్జిగ ఉంటుంది. రాత్రి ఒక కూర, అరటిపండు ఇస్తారు. ఆదివారం మధ్యాహ్నం చికెన్ పెడతారు.

# వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



**కురుపాం, పతాకం న్యూస్:** ప్రజలకు అందుతున్న వైద్య సేవల్లో ఎటువంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి వైద్య సిబ్బందిని హెచ్చరించారు.జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి రోగులకు ఉచితంగా మందులు అందించాలని ఆదేశించారు. గర్భిణుల నమోదు, వ్యాక్సినేషన్ రికార్డులు, శిశు మరణాల నివారణ చర్యలను సమీక్షించారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు పరిశుభ్రంగా ఉంచి రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు.విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలిగిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జెసి స్పష్టం చేశారు. జియ్యమ్మవలస మండలం పిటి మండ, టి.కె.జమ్మూల్లో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలబాలికల పాఠశాలలను, కొమరాడ మండలం కెమిశీల గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యా బోధన, వసతులు, భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థుల చదువుపై ఆసక్తిని అడిగి తెలుసుకున్నారు. ఒక విద్యార్ధుల వద్దకు వెళ్ళి రాస్తున్న నోట్ పుస్తకాలను పరిశీలించి, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా స్థాయిని పరీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వంట గదులు పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. హాస్టళ్లలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు సక్రమంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పెరగేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి భోజన నాణ్యతను పరిశీలించారు. తనిఖీలో భాగంగా సంబంధిత యాప్‌లలో డేటా నమోదు మరియు ఇతర డిజిటల్ రికార్డులను కూడా ఆయన స్మార్ట్‌ఫోన్ ద్వారా స్వయంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, వైద్యాధికారులు, పాఠశాలల హెచ్ఎంలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలి

**కోనసీమ, పతాకం న్యూస్:** ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతఅత్వంలో ప్రభుత్వం మహిళల సంరక్షణ కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. బుధవారం ఊబలంక పిహెచ్సీ పరిధిలో కిషోర్ బాలికల కోసం ప్రభుత్వం అందిస్తున్న హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గన్నారు. ముందుగా పీహెచ్సీ పరిసరాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... మహిళలు ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న క్యాన్సర్ వంటి మహమ్మారులను ఎదుర్కోవడం కోసం ముందస్తు చర్యల్లో భాగంగా 14 సంవత్సరాల వయస్సు నుంచి 15 సంవత్సరాల వయస్సు ఉన్న కిశోర బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ వేయడం ద్వారా వారు గర్భాశయ క్యాన్సర్ తోపాటు అనేక క్యాన్సర్‌లకు గురి కాకుండా ఉండాలనే ఆలోచనతో బఅహత్తరమైన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కొనియాడారు. కిశోర బాలికలు అందరికీ ఉచితంగా వ్యాక్సిన్ అందించడం గొప్ప విషయమన్నారు. బయట మార్కెట్లో ఈ వ్యాక్సిన్ ఖరీదు రూ.4వేల



వరకూ ఉంటుందని, మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం మొదలుపెట్టిన ఈ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషించే మహిళల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రధానమైన అంశంగా భావించి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనే మహమ్మారిని రూపుమాపాలనే లక్ష్యంతో హెచ్ పి వి ఇంజక్షన్లు స్పెషల్ డ్రైవ్ ద్వారా అందిస్తున్నారన్నారు.

## మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత



**సామర్లకోట, పతాకం న్యూస్:** వేట్లపాలెం బాణసంచా పేలుడు ఘటనలో పలు మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరిహారాన్ని టిడిపి నాయకులు అందజేశారు. గత నెలలో జరిగిన బాణసంచా కేంద్ర భారీ విస్ఫోటనంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఏడు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షల చొప్పున పరిహారాన్ని చెక్కుల రూపంలో నియోజకవర్గ టిడిపి పరిశీలకులు బోళ్ల వెంకటరమణ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రారంభం నుంచి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృతి చెందిన దర్శిపాటి లోవరాజు(40), దర్శిపాటి రాజు(30), వేమగిరి లోవరాజు(38), పల్లపాటి వీరశ్రీను(45), కాతేటి శ్రీను(33), మోర్త శ్రీను(30), సప్పా సత్యవేణి(34) కుటుంబాలకు పరిహారం చెక్కులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఒ వివిఎస్.లక్ష్మణ్‌రావు, ఎఎంసి ఛైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, టిడిపి పట్టణ అధ్యక్షులు బదుగు శ్రీకాంత్, నాయకులు పిట్టా జానకిరామారావు, జనసేన పట్టణ అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పేదలకు పెన్నిధి సీఎం సహాయ నిధి..



**నంద్యాల, పతాకం న్యూస్:** :సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గానికి చెందిన 73 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.59లక్షలు విలువగల చెక్కులను వేల్పనూరు నందు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## గుడ్డుకు గడ్డుకాలం



**చిత్తూరు, పతాకం న్యూస్:** గల్ఫ్ దేశాల్లో యుద్ధ ప్రభావం కోడిగుడ్ల ధరలపై పడింది. ఏడాది ప్రారంభంలో ఒక గుడ్డు ధర ఎనిమిది రూపాయలు ఉంటే ప్రస్తుతం సగానికి సగం పడిపోయింది. యుద్ధ ప్రభావంతో ఎగుమతులు ఆగిపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని పౌల్ట్రీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కోడిగుడ్ల ధర మరింత పతనమవుతుందని చెబుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో కోడిగుడ్లు ఎగుమతుల్లో తమిళనాడు రాష్ట్రం నమక్కల్ మొదటి స్థానం, చిత్తూరు జిల్లా రెండో స్థానంలో ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లి, పలమనేరు, పూతలపట్టు, పుత్తూరు ప్రాంతాల్లో పౌల్ట్రీలు పెద్దమొత్తంలో ఉన్నాయి. 12 నుంచి 15 భారీ పౌల్ట్రీలు ఉన్నాయి. 1500 మంది కుటీర పరిశ్రమగా నిర్వహిస్తున్నారు. మొదట్లో కోళ్ల పరిశ్రమ కాస్త ఆశాజనకంగా ఉన్నా కాలానుగుణంగా వచ్చిన నష్టాలతో అనేక కోళ్ల ఫారాలు మూతపడ్డాయి. ప్రస్తుతం బాయిలర్, లేయర్స్ (గుడ్లు పెట్టే కోళ్లు) ఫారాలు 1500 ఉన్నాయి. సరాసరిన రోజుకు ఐదు నుంచి ఆరు లక్షల కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. చిత్తూరు జిల్లా నుంచి ప్రతిరోజు లక్షకు పైగా కోడిగుడ్లు చెన్నై పోర్టు నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. గల్ఫ్‌యుద్ధ ప్రభావంతో గత నెల 27 నుంచి 12 దేశాలకు ఎగుమతి అవుతున్న కోడిగుడ్లు నిలిచిపోయాయి. దీంతో స్థానికంగా కోడిగుడ్లను విక్రయించుకోవాల్సిన పరిస్థితి రావడంతో గుడ్ల ధర ఒక్కసారిగా పతనమైనట్లు నేషనల్ ఎగ్ కో- ఆర్డినేషన్ కమిటీ జిల్లా నాయకత్వం పేర్కొంది. ఒక గుడ్డు ఉత్పత్తి చేసేందుకు పౌల్ట్రీ ఫారం రైతు రూ.5 నుంచి 5.50 వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని, గుడ్డు ధర ప్రస్తుతం నాలుగు రూపాయలు పలకడంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ధర మరింత పతనమై తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంటామని పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. 60 రోజులకు మించి కోడిగుడ్లను శీతల గిడ్డంగుల్లో పెట్టుకునే అవకాశం లేదు. గుడ్డు ధర పతనం కావడంతో చికెన్ సెంటర్ నిర్వాహకులు కిలో చికెన్‌కు నాలుగు గుడ్లు ఉచితంగా అందిస్తున్నారు. పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని నేషనల్ ఎగ్ కో- ఆర్డినేషన్ కమిటీ, పౌల్ట్రీ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నమక్కల్‌లో ఎగుమతులు ఎక్కువగా ఉండటం వల్ల ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు దిగుమతులు చేయడం వల్ల ధరలు పతనమయ్యాయని నెక్ అసోసియేషన్ జాతీయ నాయకులు రమేష్ తెలిపారు.

## ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి

**ఏలూరు, పతాకం న్యూస్:** ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో బుధవారం నవజాత శిశువు మృతి చెందింది. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన గొంద్రి నాగలక్ష్మిని ప్రసవ వేదనలతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బంధువులు చేర్పించారు. అయితే సమయానికి శస్త్ర చికిత్స చేయలేదని, ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నవజాత శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆగ్రహానికి గురైన బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులైన డాక్టర్లు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

## బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు



**కాకినాడ, పతాకం న్యూస్:** జిల్లాలోని పలు బాణసంచా తయారీ కేంద్రాల్లో ఎస్పీ బిందుమాధవ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కరప పోలీస్ స్టేషన్ పరిధిలోని వేలంగి, నడకుదురు, ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగనాపల్లి, కొవ్వూరు గ్రామాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పేలుడు పదార్థాల నిల్వ విధానం, భద్రతా చర్యలు, అగ్నిమాపక పరికరాల అందుబాటు, యూనిట్లకు సంబంధించిన లైసెన్సుల చెల్లుబాటు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. పేలుడు పదార్థాల చట్టం ఇతర భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని యాజమాన్యాలను ఆదేశించాఉరు. యూనిట్ యజమానులు, కార్మికులతో మాట్లాడిన ఆయన పేలుడు పదార్థాలను అత్యంత జాగ్రత్తతో నిర్వహించాలని, భద్రతా పరికరాలు తప్పనిసరిగా వినియోగించాలని, అనధికారికంగా తయారీ లేదా నిల్వ చేయరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే యూనిట్లపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పి స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి తనిఖీలు తరచుగా కొనసాగుతాయని ఆయన తెలిపారు.

## అమరావతిలో భారీ అగ్నిప్రమాదం..



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డులో చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాద ఘటనపై ఏపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ అగ్ని ప్రమాదం.. ప్రమాదవశాత్తు జరిగిందా? లేక కుట్ర ఏమైనా ఉందా? అనే కోణంలో విచారణ జరపాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కాగా సమీప పోలంలో నుంచి మంటలు వచ్చాయని ఎల్ అండ్ టీ ప్రతినిధులు వెల్లడించారు. పోలం నుంచి పైపుల వరకు గడ్డి పేర్చి.. పైపులకు నిప్పు పెట్టినట్లు అనవాళ్లు ఉన్నాయని అంటున్నారు. ఈ ప్రమాద ఘటన స్థలానికి ఫోరెన్సిక్ బృందం ఇప్పటికే చేరుకుంది. మరో వైపు పోలాల వైపు నుంచి మంటలు అంటుకుంటూ వచ్చాయని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. అయితే ఈ ప్రమాదంపై పలు సందేహాలను స్థానికులు వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. ఏడు అగ్నిమాపక వాహనాలు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. మంటలు అదుపులోకి వచ్చాయని ఫైర్ డీజీ వెంకట రమణ వెల్లడించారు. అగ్నికి ఆహుతి అయిన పైప్ లైన్లు అన్ని ఏడు రకాల ఎమినిటీస్ కల్పించేందుకు ఉంచినవని అధికారులు వెల్లడించారు. ఇవన్నీ పీవీసీ పైపులని.. చాలా

# గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ..!

గుండె జబ్బుల బారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతుందని చెప్పవచ్చు. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, ధూమపానం, మద్యపానం, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వంటి వివిధ కారణాల వల్ల గుండె జబ్బుల బారిన పడే వారు ఎక్కువవుతున్నారు. దీంతో గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యల బారిన పడడంతో పాటు ప్రాణాలను కూడా కోల్పోయే పరిస్థితి నెలకొంది. కనుక గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో చాలా మంది తీసుకునే ఆహారం ముఖ్య పాత్ర పోషిస్తుంది. సరైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు గుండె జబ్బులు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని ఆహారాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.

సాల్మన్, మాకేరెల్, సార్డిన్ వంటి చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మంటను తగ్గించి ట్రైగ్లిజరాయిడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఆరోగ్యకరమైన గుండె లయకు కూడా ఇవి తోడ్పడతాయి. ఓట్స్ కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలో కలిగే ఫైబర్ ఉంటుంది. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. పాలకూర, కాలే వంటి వాటితో పాటు ఇతర ఆకుకూరలను తీసుకోవడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించి ధమనుల ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి. అదే విధంగా బాదం, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా విత్తనాలు వంటి వాటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. వీటిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు వాపును తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో తోడ్పడతాయి.



స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ వంటి వాటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెను ఆక్సీకరణ ఒత్తిడిని నుండి కాపాడడంలో, రక్తనాళాల పనితీరును మెరుగుపరచడంలో దోహదపడతాయి. ఆలివ్ ఆయిల్ లో ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. ఈ విధంగా తగిన ఆహారాలను తీసుకుంటూ రోజూ వ్యాయామం చేయడం, ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకోవడం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, జంక్ ఫుడ్ కు దూరంగా ఉండడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం వంటివి చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు గుండె జబ్బుల బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.

## వెదురు సేకరణపై అటవీశాఖ అభ్యంతరాలతో
# ఉపాధి కోల్పోతున్న ఆదివాసీలు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అటవీ ప్రాంతాల్లో వెదురు సేకరించి అమ్ముకునే హక్కు గిరిజనులకు ఉంది. ఈ మేరకు పదిహేన్నేళ్ల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. అయినా అటవీశాఖ అభ్యంతరాల కారణంగా ఇప్పటికీ వెదురుపై గిరిజనులకు హక్కు లేకుండాపోయింది. అటవీశాఖ కేవలం అందుబాటులో ఉన్న వెదురు మాత్రమే సేకరించి మిగిలినది వదిలేస్తుండడంతో చాలా వరకు వెదురు నిరుపయోగంగా ఉంటోంది. ఇటు అటవీశాఖకు ఆదాయం రాకపోగా, అటు గిరిజనులు ఉపాధి కోల్పోతున్నారు. అటవీ ప్రాంతాల్లోని గిరిజనులు వెదురు సేకరించి అమ్ముకోవచ్చునని 2011లో అప్పటి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీని ప్రకారం గిరిజన మహిళలు సంఘాలుగా ఏర్పడి వెదురు సేకరించి విక్రయించుకోవచ్చు. ఈ క్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని నాతవరంలో అప్పట్లో గిరిజనులు వెదురు అమ్మకాలు ప్రారంభించారు. అయితే అటవీశాఖ అభ్యంతరాలతో ఇది ఎక్కువ కాలం సాగలేదు. కాగా తొమ్మిదేళ్ల క్రితం వెదురును అటవీయేతర ప్రాంతాల్లో కూడా గిరిజనులు అమ్ముకోవచ్చునని కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనికి తోడు 1926 నాటి అటవీ చట్టాన్ని సవరిస్తూ మూడేళ్ల క్రితం పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించింది. ఇన్ని పరిణామాలు జరిగినా అటవీశాఖ తీరు వలన గిరిజనులకు మాత్రం వెదురుపై హక్కు రాలేదు. చింతపల్లి అటవీ డివిజన్‌లో ఎక్కువగా వెదురు కూపీలున్నాయి. ఏటా 40 లక్షల నుంచి 60 లక్షల మధ్యలో వెదురు తీసే అవకాశం ఉంది. దీని ద్వారా అటవీశాఖకు రూ.కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. డివిజన్ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న వెదురులో కేవలం 40 శాతం మాత్రమే అటవీశాఖ సేకరిస్తోంది. మిగిలినది తీసేందుకు వీలులేక వదిలిపెడుతోంది. దీంతో కొండలపై వెదురు వృథాగా ఉంటోంది. గత 2023లో సేకరించిన వెదురులో సుమారు 30 వేల వెదురు బొంగులు అమ్మకాలకు నోచుకోక అటవీ డిపోల్లోనే పేరుకుపోయాయి. దీంతో రెండేళ్ల నుంచి అటవీశాఖ వెదురు సేకరణకు స్వస్తి చెప్పింది. ప్రస్తుతం వెదురును ఎక్కడ నుంచి తీసుకువచ్చినా అటవీశాఖ పట్టుకుంటోంది. గతంలో రాజమండ్రి పేపర్‌మిల్లు మన్యం వెదురును వినియోగించేది. ప్రస్తుతం మైదానంలో సుబాబుల్, సరుగుడు, యూకిలిప్టస్ వంటి కలపను పేపర్‌మిల్లు వినియోగిస్తూ మన్యం వెదురును వదిలేసింది. అటవీశాఖ సాధ్యమైనంత వరకు వెదురును దినకూలీ ప్రాతిపదికన గిరిజనులతోనే సేకరించి నిల్వ కేంద్రాల వద్ద ఉంచుతుంది. నెలకు ఒకసారి వేలం వేస్తుంది. ప్రస్తుతం వెదురు ఒక్కింటికి సైజును బట్టి స్థానికంగానే రూ.200-400 మధ్య ధర పలుకుతోంది. అయితే అటవీశాఖ సేకరించగా మిగిలిన వెదురు అయినా గిరిజనులు సేకరించుకుని అమ్ముకునే అవకాశం కల్పిస్తే ఆర్థికంగా వారు బలోపేతం అయ్యే అవకాశం ఉంటుంది. వెదురు సేకరణలో తమకు అటవీ శాఖ అభ్యంతరం చెప్పకుండా చూడాలని ప్రభుత్వాన్ని గిరిజనులు కోరుతున్నారు.

## అమెరికాలో చమురు శుద్ధి కర్మాగారం ప్రారంభం..
## పెట్టుబడులు పెట్టిన రిలయన్స్



**వాషింగ్టన్:** టెక్సాస్ లోని బ్రౌన్స్‌విల్లేలో కొత్త చమురు శుద్ధి కర్మాగారం ప్రారంభించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టిన భారత ప్రైవేట్ ఇంధన దిగ్గజం రిలయన్స్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ లో చేసిన పోస్టు ద్వారా ఈ విషయాన్ని తెలిపారు. "అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ ప్రాజెక్ట్ అమెరికా మార్కెట్లకు ఇంధనం అందించడమే కాకుండా దేశ జాతీయ భద్రతను బలోపేతం చేస్తుంది. ఇది అమెరికాలో ఇంధన ఉత్పత్తిని పెంచి, బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని తీసుకువస్తుంది. ప్రపంచంలోనే అత్యంత శుభ్రమైన శుద్ధి కర్మాగారంగా ఇది నిలుస్తుంది" అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. అదే పోస్టులో భారతదేశంలోని భాగస్వాములకు, ముఖ్యంగా భారీ పెట్టుబడి పెట్టిన అతిపెద్ద ప్రైవేట్ ఇంధన సంస్థ అయిన రిలయన్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు మొత్తం విలువ సుమారు 300 బిలియన్ డాలర్లని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఇది పూర్తిగా ఒకే ప్రాజెక్టుకే సంబంధించినదా లేక భారత్‌తో ఉన్న పెద్ద ఒప్పందంలో భాగమా అన్నది స్పష్టంగా తెలియలేదు. ఇప్పటికే 2024లో డల్లాస్ ప్రాంతానికి చెందిన స్టార్టప్ సంస్థ ఎలిమెంట్ ఫ్యూయల్స్ హోల్డింగ్స్ బ్రౌన్స్‌విల్లేలో దాదాపు 50 సంవత్సరాల తర్వాత పూర్తిగా కొత్త అమెరికన్ చమురు శుద్ధి కర్మాగారం నిర్మించేందుకు ప్రణాళికను తిరిగి ప్రారంభించినట్లు ప్రకటించింది. "అమెరికా ఫస్ట్ రిఫైనింగ్" ప్రాజెక్టుకు సంబంధించిన వెబ్‌సైట్‌లో ఎలిమెంట్ ఫ్యూయల్స్ విడుదల చేసిన పూర్వ ప్రకటనలు కూడా పొందుపరిచినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే అమెరికా ఇంధన రంగంలో పెద్ద మార్పులు తీసుకురావడంతో పాటు భారత్-అమెరికా ఇంధన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.




# బీసీసీఐ ప్రైజ్ మనీ రూ. 131 కోట్లను ఎలా పంపిణీ చేస్తారంటే?



టీ20 ప్రపంచకప్ 2026లో చారిత్రాత్మక విజయం సాధించిన భారత క్రికెట్ జట్టుపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (దీజజ×) కాసుల వర్షం కురిపించింది. వరుసగా రెండోసారి కప్పు గెలిచి చరిత్ర సృష్టించినందుకు గాను మొత్తం రూ. 131 కోట్ల భారీ నగదు బహుమతిని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ భారీ మొత్తాన్ని జట్టు సభ్యులు, కోచ్‌లు, ఇతర సిబ్బందికి ఏ విధంగా పంపిణీ చేయనున్నారనే దానిపై ఆసక్తికర వివరాలు వెలుగులోకి వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం ప్రపంచకప్ ఆడిన 15 మంది సభ్యుల జట్టులోని ప్రతి ఆటగాడికి రూ. 6 కోట్ల చొప్పున అందనుంది.

అంటే కేవలం ఆటగాళ్లకే సుమారు రూ. 90 కోట్లు అందుతాయి. 2024 ప్రపంచకప్ గెలిచినప్పుడు ప్రతి ఆటగాడికి రూ. 5 కోట్లు ఇవ్వగా, ఈసారి ఆ మొత్తాన్ని మరో కోటి రూపాయలు పెంచడం గమనార్హం. మిగిలిన రూ. 41 కోట్లను కోచింగ్ స్టాఫ్, సపోర్ట్ స్టాఫ్, సెలెక్టర్లకు పంపిణీ చేయనున్నారు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లకు సమానంగా లేదా వారి సీనియారిటీని బట్టి భారీ మొత్తమే దక్కనుంది. ఇతర సపోర్ట్ స్టాఫ్ (ఫిజియోలు, మసాజర్లు, థెరపిస్టులు) కి వారి హోదా, అనుభవం ఆధారంగా వాటాను నిర్ణయించనున్నారు.

బీసీసీఐ ఇచ్చే ఈ రూ. 131 కోట్లు కాకుండా, ఐసీసీ నుంచి కూడా భారత జట్టుకు సుమారు రూ. 21.5 కోట్ల (ఖూణ 2.34 మిలియన్) విజేత నగదు బహుమతి లభించింది. దీంతో టీమిండియా ఆటగాళ్ల ఖాతాల్లోకి భారీగా నగదు వచ్చి చేరనుంది. వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత జట్టుకు ఇది తగిన గుర్తింపు అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు.


## ఐపీఎల్ ముగిశాకే వన్డే ప్రపంచ కప్ సన్నాహాలు: గౌతమ్ గంభీర్



టీ20 ప్రపంచ కప్ 2026 విజేతగా టీమిండియా నిలిచిన సంగతి తెలిసిందే. వరుసగా రెండో సారి, ఓవరాల్‌గా ముచ్చటగా మూడోసారి పొట్టి ప్రపంచ కప్ ట్రోఫీని టీమిండియా ముద్దాడింది. అయితే ఇప్పుడు భారత్ దృష్టంతా వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచ కప్ మీదే ఉంది. ఈ నేపథ్యంలో టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ 2026 ముగిసిన తర్వాత వన్డే ప్రపంచ కప్ 2027 సన్నాహాలు ప్రారంభం అవుతాయని తెలిపాడు. 'వన్డే ప్రపంచ కప్ 2027 కోసం ఐపీఎల్ ముగిసిన తర్వాత సన్నాహాలు ప్రారంభం అవుతాయి. ఐపీఎల్ 2026 నుంచి వన్డే ప్రపంచ కప్ వరకు దాదాపు 25 నుంచి 30 వన్డే మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ఫార్మాట్లో ఎక్కువగా మ్యాచ్‌లు జరగడం లేదు. ఎంత త్వరగా సన్నాహకాలు ప్రారంభిస్తే.. అంత మంచిది' అని గంభీర్ అన్నాడు. ఈ వన్డే మెగా టోర్నీ సౌతాఫ్రికా వేదికగా జరగనున్న విషయం తెలిసిందే. అక్కడి పిచ్‌ల గురించి కూడా అతడు మాట్లాడాడు. 'దక్షిణాఫ్రికాలో క్రికెట్ ఆడటం అంత తేలిక కాదు. ఆ పరిస్థితులకు తగ్గట్లు ఆడే ఆటగాళ్లను గుర్తించి ఎంపిక చేయాల్సి ఉంటుంది. సెలెక్టర్లు, కోచ్‌లు ఆ పని చూసుకుంటారు. ఐపీఎల్ 2026 ముగిసే సమయానికి వన్డే ప్రపంచ కప్ 2027 కోసం టీమిండియా బ్లూ ప్రింట్ సిద్ధమవుతుంది' అని గంభీర్ వివరించాడు.




# ‘జైలర్-2’లో పోలీస్ ఆఫీసర్‌గా షారూఖ్?



రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సినిమా ‘జైలర్-2’. 2023లో విడుదలైన జైలర్‌కు సీక్వెల్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో బాలీవుడ్ నటుడు షారూఖ్‌ఖాన్ నటించబోతున్నట్లుగా సమాచారం. ముత్తువేల్ పాండియన్‌గా మరోసారి రజనీకాంత్ సందడి చేయనున్నారు. పార్ట్-2ను దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. ఇదే ఏడాదిలో ఈ మూవీ విడుదల కానుంది. పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటించేందుకు షారూఖ్ కూడా అంగీకరించినట్లుగా తెలిసింది. ఏడు నుండి ఎనిమిది రోజుల పాటు చిత్రీకరించబడే అతని సన్నివేశాలతో ఈ సినిమా ఫైనల్‌షూట్ ముగుస్తుందని భావిస్తున్నారు. మార్చి చివరి వారంలో జైలర్ -2 సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తారని తెలుస్తోంది. ‘జైలర్’లో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్ వంటి స్టార్ నటులు సినిమాను మలుపుతిప్పే అతిథి పాత్రల్లో నటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు షారూఖ్‌ఖాన్ కూడా అలాంటి పాత్రలోనే కనిపించబోతున్నారు. ఎస్‌జె సూర్య కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రజనీకాంత్ కోడలు శ్వేతా పాండియన్ పాత్ర పోషించిన నటి మిర్నా కూడా ఈ సీక్వెల్‌లో కీలక పాత్ర పోషించనున్నారని పరిశ్రమలో చర్చ జరుగుతోంది.

## 13న ఓటీటీలోకి వస్తున్న..

# ‘కపుల్ ఫ్రెండ్లీ’.



యువ హీరో సంతోష్ శోభన్, మాజీ మిస్ ఇండియా మానస వారణాసి జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా ‘కపుల్ ఫ్రెండ్లీ’ ఓటీటీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ప్రేమికుల రోజు కానుకగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, మార్చి 13 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళ భాషలోనూ ఈ సినిమా అందుబాటులో ఉండనుంది.

అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్, నగరాల్లో ఉద్యోగాల కోసం కష్టపడుతున్న యువతరం జీవితాలను, వారి మధ్య చిగురించే ప్రేమను సహజంగా ఆవిష్కరించింది. థియేటర్లలో యువతను బాగా ఆకట్టుకున్న ఈ సినిమా కథాంశం ఆసక్తికరంగా సాగుతుంది. నేటితరం యువత ఎదుర్కొంటున్న కెరీర్ సమస్యలు, ప్రేమ, సహజీవనం వంటి అంశాల చుట్టూ అల్లుకున్న కథ ఇది. చెన్నైలో ఇంటీరియర్ డిజైనర్‌గా స్థిరపడాలనుకునే శివ (సంతోష్ శోభన్), ఐటీ ఉద్యోగం కోసం ప్రయత్నించే మిత్ర (మానస వారణాసి) తమ లక్ష్యాల కోసం పోరాడుతుంటారు. అవకాశాలు రాక ఇబ్బంది పడుతున్న సమయంలో వీరిద్దరూ కలుస్తారు. ఒకే రకమైన లక్ష్యాలు, సమస్యలతో సతమతమవుతున్న శివ, మిత్ర అనుకోని పరిస్థితుల్లో ఒకే ఇంట్లో కలిసి ఉండాల్సి వస్తుంది. పెళ్లి కాకుండానే వారి మధ్య మొదలైన ఈ సహజీవనం ఎలాంటి మలుపులు తీసుకుంది? వారిద్దరి మధ్య ప్రేమ ఎలా పుట్టింది? ఉద్యోగాల వేటలో వారు పడిన కష్టాలు ఫలించాయా? చివరికి వారి ప్రేమకథ సుఖాంతం అయిందా లేదా? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమా సాగుతుంది




# పెళ్లి పీటలు ఎక్కబోతున్న కావ్య కళ్యాణ్ రామ్



టాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు కీరవాణి కుటుంబంలో త్వరలోనే శుభకార్యం జరగబోతుందనే వార్త ఇప్పుడు ఫిలిం నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కీరవాణి కుమారుడు, తన గాత్రం తోనూ, సంగీతంతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కాలభైరవ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సమాచారం. అయితే, ఆయన పెళ్లాడబోయే అమ్మాయి మరెవరో కాదు... టాలీవుడ్ యువ నటి కావ్య కళ్యాణ్ రామ్ అని తెలుస్తోంది. వీరిద్దరి మధ్య కొంతకాలంగా సాగుతున్న పరిచయం కాస్తా ప్రేమగా మారిందని, ఇప్పుడు ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో పెళ్లి పీటలు ఎక్కేందుకు సిద్ధమైనట్లు ఫిలిం నగర్ టాక్. కాలభైరవ ‘కార్తికేయ 2’ వంటి చిత్రాలతో మ్యూజిక్ డైరెక్టర్‌గా తన సత్తా చాటగా, కావ్య కళ్యాణ్ రామ్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టి ‘మసూద’, ‘బలగం’ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలతో హీరోయిన్‌గా మంచి క్రేజ్ సంపాదించుకుంది.

ప్రస్తుతం రెండు కుటుంబాల్లో వివాహ వేడుకలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, ముహూర్తాలు ఖరారైన తర్వాత సోషల్ మీడియా వేదికగా అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సన్నిహిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. మెగా, అక్కినేని కుటుంబాల వివాహ వేడుకల సందడి తర్వాత, ఇప్పుడు కీరవాణి ఇంట జరగబోయే ఈ వేడుకపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**